## వివాదాల్లోనే కొనసాగుతున్న నిత్యహారతి

**● కమిటీ ఆధ్వర్యంలోనే కార్యక్రమం ● పాల్గొనని వేద పాఠశాల స్వామిజీ**



గోదావరికి హారతి నిర్వహిస్తున్న దృశ్యం

బాసర, మే 3 : బాసర పుష్కర ఘాట్ వద్ద వేద పాఠశాల ఆధ్వర్యంలో నిత్యం నిర్వహించే హారతి కార్యక్రమం వివాదాల్లోనే కొనసాగుతున్నది. కొన్ని రోజుల క్రితం హారతి కార్యక్రమాన్ని కొన్ని ఘటనల నేపథ్యంలో నిలిపివేశారు. కాగా.. శుక్రవారం(మే 2వ తేదీ) నుంచి కొత్తగా నిర్వహించిన వేద పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ హారతి కార్యక్రమానికి వేద పాఠశాల స్వామిజీ హాజరు కాకపోవడంతో పలువురికి ఆశ్చర్యంగా అనిపిస్తున్నది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కమిటీతోపాటు కొందరు భక్తులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేసి కార్మికులను ఆదుకోవాలి. గత 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదు. తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునే వరకు ప్రభుత్వంతో పోరాడుతాం. ఆర్టీసీని నిర్వీర్యం చేసి ప్రైవేటు పరం చేసేలా ఈ ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. సమస్యల సాధనకు రాజీపడే ప్రశ్నేలేదు. ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొనాలని ఇప్పటికే కార్మికులను సన్నద్ధం చేశాం.

*- ఆర్. గంగాధర్, టీఎంయూ జిల్లా కార్యదర్శి*

### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి..



గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఆ మేరకు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసి వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో విలీన అంశం ఉన్నప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎలక్ట్రానిక్ బస్సులను హైర్ చేసుకుని డిపోలన్నింటినీ ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారు. ప్రభుత్వమే ఈవీ బస్సులను కొనుగోలు చేయాలి. కారుణ్య నియామకాలు పొందిన వారికి మూడేండ్లపాటు కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణిస్తున్నారు. దీనిని రద్దు చేసి రెగ్యులర్ చేయాలి.

*- ఏఆర్ రెడ్డి, టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు*



# సమ్మె సైరన్

**ఆర్టీసీలో 21 డిమాండ్లతో నోటీసు అందజేత**

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- స్పందించని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఈనెల 7వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటన

నిర్మల్, మే 3(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె సైరన్ మోగనున్నది. తెలంగాణ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గత జనవరి 27వ తేదీన ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించారు. యాజమాన్యం, ప్రభుత్వం, లేబర్ కమిషన్ నుంచి స్పందన రాకపోవడంతో గత ఏప్రిల్ 7వ తేదీన 'చలో లేబర్ కమిషన్' కార్యాలయం చేపట్టారు. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లేబర్ కమిషన్ కార్యాలయానికి తరలివెళ్లి సమ్మె తేదీని ప్రకటించారు. 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును కార్యాలయంలో అందజేశారు. నెలలోగా తమ డిమాండ్లకు పరిష్కారం చూపకుంటే సమ్మెకు దిగుతామని నోటీసులో పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు అసెంబ్లీ తీర్మానం చేసింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు అనేక హామీలిచ్చింది. తాము అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా తమ సమస్యలకు పరిష్కారం దొరకకపోవడంతో సమ్మెకు దిగుతున్నట్లు ఆర్టీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. గత కొంతకాలంగా సమస్యల సాధన కోసం ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ ప్రభుత్వంలో కనీస చలనం రాలేదు. ఇప్పటికే సమ్మె నోటీసు అందజేసిన ఆర్టీసీ జేఏసీ ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెబాట పట్టేందుకు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నది. శుక్రవారం నిర్మల్ డిపో పరిధిలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఆర్ రెడ్డి నేతృత్వంలో సమ్మె సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమ్మెకు సన్నద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్లను సాధించుకునే వరకు ప్రభుత్వంపై పోరాడేందుకు కార్మికులంతా ఏకతాటిపైకి వస్తున్నారు.

**ఈ నెల 7 నుంచి సమ్మె..**

ఈ నెల 7 నుంచి ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగుతుండడంతో బస్సులన్నీ డిపోలకే పరిమితం కానున్నాయి. జిల్లాలో నిర్మల్, భైంసా పట్టణాల్లో ఆర్టీసీ బస్సు డిపోలు ఉండగా, ఆయా డిపోల పరిధిలో దాదాపు 220 బస్సులు ఉన్నాయి. నిర్మల్ డిపోలో 147 బస్సులు ఉండగా, 427 మంది కార్మికులు పని చేస్తున్నారు. అలాగే భైంసా డిపోలో 70 బస్సులు ఉండగా, ఇక్కడ 320 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే సమ్మె కారణంగా బస్సులు బయటకు రాకపోతే ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోతే ప్రయాణం భారంగా మారనున్నది. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నాన్చివేత ధోరణి అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అటు కార్మికులతోపాటు ప్రజలు మండిపడుతున్నారు.



నిర్మల్ బస్‌డిపోలో నిలిపి ఉంచిన బస్సులు

**ప్రధాన డిమాండ్లు..**

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.
- ఆర్థికపరమైన అంశాలను అమలు చేస్తూ, ప్రస్తుత సౌకర్యాలను యథావిధిగా ఉంచి ప్రభుత్వంలో విలీనం చేయాలి.
- 2021 వేతన సవరణ అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమాన జీతాలు అందజేయాలి.
- 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకూ వేతన సవరణ అమలు చేయాలి.
- కొత్త బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీ అభివృద్ధి చేసి ఆధునికీకరించాలి.
- సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి రాయితీలు, సంస్థ అభివృద్ధికి యేటా బడ్జెట్‌లో మూడు శాతం నిధులు కేటాయించాలి.
- విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలి.
- మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్‌కు బదులుగా మహిళలకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలి.
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి.
- అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేసి అర్హులైనవారికి పదోన్నతి కల్పించాలి.
- పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలను చెల్లించాలి.
- అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న రిటైర్డ్ అధికారులు, సూపర్‌వైజర్లను తొలగించి వారి స్థానాలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లు



# జొన్నల కొనుగోళ్లలో దళారుల దందా

**● రైతుల పేరిట విక్రయానికి ప్రయత్నాలు ● అధికారులు దృష్టిసారించాలంటున్న రైతులు**

ఆదిలాబాద్, మే 3(నమస్తే తెలంగాణ) : జిల్లా వ్యాప్తంగా పలు మార్కెట్ యార్డుల్లో ప్రభుత్వం జొన్నల కొనుగోళ్లను ప్రారంభించి, మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 చొప్పున సేకరిస్తున్నది. అక్రమాలకు అవకాశం లేకుండా కొనుగోళ్లు జరపాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర రూ.3,371 ఉండగా రూ.2,500లకు తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 1.12 లక్షల ఎకరాల్లో పంట సాగవగా.. ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఎకరాకు 14 క్వింటాళ్ల వరకు పంట సేకరణ పరిమితి విధించగా.. మిగిలిన జొన్నలను రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కౌలు రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్మే అవకాశం లేకపోవడం, పట్టాలు లేని భూములున్న రైతులు, క్రాప్ బుకింగ్ జరగని వారు దళారులకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకున్నది.

**దళారుల అక్రమ దందా షురూ..**

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఎక్కువగా ఉండడంతో దళారులు అక్రమ దందాకు తెర లేపారు. ఇచ్చోడ మండలంలోని మాదాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 258 క్వింటాళ్లు, ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల జొన్నలను అధికారులు పట్టుకున్నారు. దళారులు గ్రామాలు, మండల, జిల్లా కేంద్రాల్లో తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తారు. సాగు చేయని రైతులను గుర్తించి వారి పట్టాలు తీసుకుని విక్రయించి క్వింటాలుకు రూ.800 వరకు లాభం పొందుతారు. జిల్లాలో ఇటీవల ముగిసిన పత్తి కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయి. రైతులు సాగు చేయకున్న వ్యాపారులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు ములాఖత్ అయి అక్రమాలకు పాల్పడ్డారు. టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాల జారీ వ్యవహారంలో ఆదిలాబాద్ మార్కెటింగ్ కార్యదర్శి మధూకర్, ఇచ్చోడ వ్యవసాయశాఖ అధికారిని సస్పెండ్ చేశారు.

### అధికారుల పర్యవేక్షణ లోపం



జొన్నల కొనుగోళ్లలో అధికారుల పర్యవేక్షణ లోపం కనపడుతున్నది. టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ కమిటీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా కమిటీలు కనిపించడం లేదు. కౌలు, గిరిజన రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్న దళారులు అక్రమంగా ఇతర రైతుల వద్ద నుంచి పట్టాలు తీసుకుని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. జొన్నల కొనుగోళ్లలో జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి అసలైన రైతులు నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఉంది.

*- సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్*

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



గూగుల్ మీట్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 3 : నేటి(ఆదివారం) నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం అధికారులకు గూగుల్ మీట్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, పరీక్షలో పొరపాట్లు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలురు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికలు, ప్రభుత్వ బాలికల పాఠశాల భుక్తాపూర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్, కామర్స్, బంగారి గూడ, తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు ఐడీ కార్డు, అడ్మిట్ కార్డ్(హాల్ టికెట్), 2 ఫొటోలు తీసుకురావాలన్నారు. జిల్లాలో 1,659 మంది పరీక్షకు హాజరు కానున్నారని, అభ్యర్థులకు పెన్నులు ఇస్తామని, కేంద్రాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అనుమతిస్తామన్నారు.

**150 మంది బందోబస్తు**

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద పూర్తిగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. కేంద్రాలను ఉదయం ఏడు గంటలకు తనిఖీ చేయాలనే సూచించారు. సరైన ధ్రువ పత్రాలు లేనిదే కేంద్రాలలోనికి అనుమతించకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లో ఇంటర్నెట్ సెంటర్లకు అనుమతి ఉండదని తెలిపారు.

**వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి..**

ఎండలో ఎక్కువ సేపు ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగలవచ్చని, జిల్లావాసులు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు నీడలో ఉండడం, టోపీ, గొడుగు వంటివి ఉపయోగించడం, సూర్యరశ్మిని నిరోధించే దుస్తులు ధరించడం మంచిదన్నారు. తేలికపాటి వస్త్రాలను ధరించాలని సూచించారు. మధ్యాహ్నం బయటకు వెళ్లడం మంచిది కాదన్నారు. వీలైతే ఉదయం, సాయంత్రం గాలి చల్లగా ఉన్నప్పుడు బయటకు వెళ్లడం మంచిదన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, వాంతులు, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. శరీరానికి తగినంత నీరు అందించడం చాలా అవసరం. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు వంటివి తీసుకోవాలన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు

**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**



యోగ సాధన చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఎదులాపురం, మే 3 : ఇక మీదట మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. 18 ఏండ్ల లోపు పిల్లలు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కాకుండా ఉండడానికి, మొట్ట మొదటిసారిగా మైనర్ డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఒకవేళ మైనర్ తెలియక ప్రమాదాలకు కారణమైతే ఇన్సూరెన్స్ రాకుండా పోతుందనే విషయాన్ని తెలియజేశారు. మధ్య తరగతి కుటుంబ సభ్యులు 18 ఏండ్లు పైబడిన పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని తెలిపారు. వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 295 మంది మైనర్లు వాహనాలతో పట్టుబడ్డారని, 295 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం వారి తల్లిదండ్రులకు వాహనాలు ఇస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రిపూట రోడ్లపై అనవసరంగా తిరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు కరుణాకర్, ప్రణయ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, మురళి, శ్రీపాల్ పాల్గొన్నారు.

**విధులను క్రమశిక్షణతో నిర్వహించాలి**

సిబ్బంది విధులు నిర్వర్తించే క్రమంలో క్రమశిక్షణతో ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రతి శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సిబ్బంది ప్రతి ఒక్కరికి పరేడ్ నిర్వహిస్తామని, పరేడ్ వల్ల సిబ్బంది ఒకరి మధ్య ఒకరికి సత్సంబంధాలు మెరుగుపడతాయన్నారు. అదేవిధంగా సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యాయామం చేస్తూ ఉండాలని సూచించారు. పరేడ్‌లో మొదటగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి మురళి ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించి ఏడు ప్లాటూన్‌లతో కూడిన పరేడ్‌లతో విడతలవారీగా ప్రత్యేక గౌరవ వందన సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పరేడ్ వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, సిబ్బంది విధులలో చెడు వ్యసనాలను గురికాకుండా ఉండాలని సూచించారు. 50 ఏళ్లు పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా పరేడ్‌కు బదులు యోగ శిక్షణను అందిస్తామన్నారు. పరేడ్‌లో భాగంగా సిబ్బందికి ఆయుధాలు, వాటి వినియోగం, ట్రాఫిక్ సిబ్బందికి సిగ్నల్స్‌పై శిక్షణ అందించారు. అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్, ఫణిదర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో నాఖాబందీ

నిర్మల్ చైన్‌గేట్, మే 3 : అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో ఏకకాలంలో నాఖాబందీ నిర్వహించారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది, జిల్లా ఏఆర్ సిబ్బందితో శనివారం సాయంత్రం నాఖాబందీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు తనిఖీలు చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ప్రొబేషనరీ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

ఎదులాపురం, మే 3 : పురుగుల మందు తాగి ప్రేమికులు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో శనివారం చోటు చేసుకున్నది. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలానికి చెందిన రాజ్ కుమార్, అదే మండలానికి చెందిన అమ్మాయి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల అమ్మాయికి కుటుంబీకులు వివాహం చేయడంతో పెళ్లయిన వారం రోజులకే ప్రియుడు రాజ్ కుమార్‌తో ఆదిలాబాద్‌కు వచ్చారు. సీసీఐ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. రిమ్స్‌కు తరలించినట్లు వన్ టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి క్షేమంగా ఉందని వైద్యులు తెలిపారు.